క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు

నవాబుపేట: వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై వాహన దారులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ఎదైనా ప్రమాదం జరిగితే అందరూ తీవ్రంగా నష్టపోతారని ఆయన వివరించారు. అలాగే పోలీసులకు మైనర్‌లు పట్టుబడితే బైక్‌లు ఇచ్చిన తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని ఆయన వివరించారు. అలాగే వాహనాలపై ఉన్న ఫైన్లు, తదితర రుసుము వెంటనే చెల్లించాలని లేనిచో అపరాధ రుసుముతో ఫైన్లు పెరిగిపోతాయని ఆయన పేర్కొన్నారు.

యూనిఫామ్స్‌ పంపిణీ



జడ్చర్ల: మండల పరిధిలోని పెద్దపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విర్కో ఫౌండేషన్‌ ద్వారా యూనిఫామ్స్‌, స్కూల్‌ బ్యాగులు పంపిణీ చేశారు. విద్యార్థులకు తమవంతుగా సహకరిస్తామని ఈసందర్భంగా ఫౌండేషన్‌ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్‌ రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రవీన, నర్సింహచారీ, శ్రీనివాస్‌యాదవ్‌, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

జడ్చర్ల టౌన్‌: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం బుధవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల అధ్యక్షురాలు చిగుళ్లపల్లి పద్మలీల మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. మాతృభాషకు ప్రాధాన్యతను ఇస్తూనే ఇతర భాషల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు వెంకటయ్య, ఉపాధ్యాయులు నోముల కృష్ణయ్య, కళావతి, రజిత, వనజ, సాయిప్రభ, పుష్పలత, తిరుపతమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రకు తరలిరండి

హన్వాడ: మండలంలో గురువారం కొనసాగనున్న విజయ సంకల్పయాత్రకు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య పిలుపునిచ్చారు. బుధవారం మ ండలకేంద్రంలో ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలకేంద్రంలో నిర్వహించే కార్నర్‌ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. భారీగా తరలివచ్చి బండి సంజయ్‌కు స్వాగతం పలుకుదామన్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ సర్కార్‌ రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు మహేందర్‌ రెడ్డి, లింగం, రఘురాంగౌడ్‌, బాలగోపీ, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



జడ్చర్ల టౌన్‌: బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం పట్టణకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 23న షాద్‌నగర్‌ నియోజకవర్గం నుంచి జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్‌కు చేరుకుంటుందని పార్టీనాయకులు తెలియజేశారు. అదేరోజున జడ్చర్లలో కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నాయకులు సామల నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, కృష్ణయ్య, సామల నాగరాజు, సీతారాం, మధు, రాజశేఖర్‌రెడ్డి, కొంగళి శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ చైర్మన్‌పై అవిశ్వాసం

బాలానగర్‌: ఉమ్మడి మండలానికి చెందిన 8 మంది డైరెక్టర్లు పీఏసీఎస్‌ చైర్మన్‌ పట్ల ప్రభాకర్‌ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం డీసీఓ కార్యాలయంలో తీర్మానం పెట్టాలని కోరుతూ లేఖ అందజేశారు.

అసంపూర్తిగా భవనం

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో యాదవ కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. సుమారు పదేళ్ల కిందట కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం పనులను మొదలు పెట్టి నిధుల లేమితో మధ్యలోనే పనులను నిలిపేశారు. అప్పట్లో కొన్ని నిధులు మంజూరు కావడంతో స్లాబ్‌ వరకు పనులు చేసి వదిలేశారు. తర్వాత నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న నిర్మాణం కూడా శిథిలావస్థకు చేరేలా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం పనులు పూర్తయ్యేలా తగిన చొరవ తీసుకోవాల్సిన అవసరముంది.

ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు



సిబ్బందితో ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ శ్రీనివాస్‌

- ముఖ్యశాఖలకు రెగ్యులర్‌ అధికారులు లేని వైనం

నవాబుపేట: మండలం పరిధిలో పలు శాఖలకు సంబంధించి ఇన్‌చార్జ్‌ అధికారులే దిక్కవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అసలే గ్రామాలకు ప్రజాప్రతినిధులు లేక స్పెషల్‌ అధికారులతో పాలన సాగుతున్న నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ఇక్కట్లకు గురిచేస్తోంది. ప్రధానమైన శాఖలకు రెగ్యులర్‌ అధికారులే కనిపించడం లేదు. మండల మెజిస్ట్రేట్‌తో పాటు ఎంపీడీఓ, విద్యాశాఖ అధికారి, విద్యుత్‌ తదితర శాఖలు చాలా రోజులుగా ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి.

- రెండు నెలల క్రితం మండలంలో ఎంపీడీఓగా శ్రీలత ఇక్కడి నుంచి ఫారిన్‌సర్వీస్‌ తీసుకుని వెళ్లిపోయారు. దీంతో నాటి నుంచి ఎంపీడీఓ లేరు. దీంతో ఇక్కడ ఉన్న సూపరింటెండెంట్‌ అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. కాగా చాలా బాధ్యతలు ఉండటం, పైగా కార్యాలయం విధులు అదనంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. పెద్ద మండలమైన నవాబుపేటలో 54 గ్రామపంచాయతీలు, స్పెషల్‌ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి పథకం తదితర వాటిని పర్యవేక్షణ చేస్తూ.. కార్యాలయం విధులు నిర్వహించడమంటే తలకు మించిన భారమనే చెప్పవచ్చు. దాదాపు రెండు నెలలుగా నెట్టుకొస్తున్నప్పటికీ.. వేసవితో ఉపాధి పనులు ఊపందుకుంటే మరింత శ్రమ పడాల్సి రావడం ఖాయం.
- గత నెలలో బదిలీల నేపథ్యంలో నవాబుపేట తహసీల్దార్‌ మల్లికార్జున్‌రావు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. నాటి నుంచి తహసీల్దార్‌ లేరు. తాజాగా డీటీ ఇన్‌చార్జ్‌గా ఉన్న నేపథ్యంలో అనేక పనులు పెండింగ్‌లో ఉండాల్సి పరిస్థితి నెలకొంది.

పర్యవేక్షణ ఇబ్బందే..

పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో పాటు ఇతర శాఖల పర్యవేక్షణ ఇబ్బందిగా ఉంది. పైగా పెద్ద మండలం ప్రజాప్రతినిధులు లేకపోవటంతో చాలా సమస్యలు ఉంటాయి. అలాగే కార్యాలయం పనులు సైతం ఉన్నాయి. వెంటనే ఎంపీడీఓను కేటాయిస్తే గ్రామాల పర్యవేక్షణ, ఉపాధి పనుల పరిశీలన సజావుగా సాగుతుంది. తాజాగా నర్సరీల పర్యవేక్షణ, ఉపాధి పనులు, గ్రామాల స్పెషల్‌ అధికారుల పర్యవేక్షణ ప్రధాన సవాళ్లుగా మారాయి.

– శ్రీనివాస్‌, ఇన్‌చార్జ్‌, ఎంపీడీఓ

- మండలానికి ఇన్‌చార్జ్‌ విద్యాశాఖ అధికారిగా రాజునాయక్‌ కొనసాగుతున్నారు. పైగా ఆయనకు హన్వాడ మండలం బాధ్యతలు సైతం ఉన్నాయి. మండలంలో 103 పాఠశాలలు, కేజీబీవీ, వసతి గృహాలు ఉన్నాయి. అలాగే హన్వాడ మండలంలో 97 పాఠశాలలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండుచోట్ల పర్యవేక్షణ చాలా ఇబ్బందనే చెప్పొచ్చు. పైగా ఇన్‌చార్జ్‌ ఎంఈఓ తాజాగా మహ్మదాబాద్‌ జెడ్పీ పాఠశాలలో జీహెచ్‌ఎంగా ఉన్నారు. దీంతో ఆయనకు నిర్వహణ కష్టంగా మారింది.
- ఇవే కాకుండా పంచాయతీరాజ్‌ శాఖ ఏఈ సైతం ఇన్‌చార్జ్జే ఉన్నారు. అలాగే విద్యుత్‌ శాఖకు సైతం ఇన్‌చార్జ్జే దిక్కయ్యారు. ఈ నేపథ్యంలో మండలానికి అధికారులను కేటాయించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నారసింహుడికి గజవాహనసేవ



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రం సింహగిరిలోని లక్ష్మీనృసింహస్వామి 37వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుప్రభాత నిత్యోత్సవాలు, పుణ్యాహవాచనం, గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణంతోపాటు ఇతర పూజలు చేశారు. పూజల్లో కమిటీ చైర్మన్‌ కొకుంట్ల చంద్రమౌళి గుప్త, ధర్మకర్తల మండలి సభ్యులు పోల శ్రీనివాస్‌, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జింక్‌ లోపం గుర్తించి చర్యలు తీసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి నరేందర్‌

రాజాపూర్‌: యాసంగిలో జింక్‌లోపం వల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాశాఖ అధికారి నరేందర్‌ అన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న వరి సాగులో ప్రధాన పొలంలో జింక్‌ ధాతులోపం గమనించినట్లైతే లీటరు నీటికి 2గ్రాములు జింక్‌ సల్ఫేట్‌ను 5రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. బుధవారం రాజాపూర్‌ మండలంలోని దోండ్లపల్లి గ్రామంలో రైతులు సాగు చేసుకున్న వరి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో కాండంతొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. పురుగు ఉధృతిని గమనించి లింగాకర్షక బుట్టలను ఎకరాకు 3 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో రైతులు తమకు ఉన్న నీటి వనరులను బట్టి వరి సాగు చేసుకోవాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసుకుంటే మరీ మంచిదని సూచించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కవిత

హన్వాడ: పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం సరిగా ఉండడం లేదని వచ్చిన విమర్శల నేపథ్యంలో బుధవారం ప్రత్యేకాధికారి కవిత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. మధ్యాహ్నభోజనంపై ఆరా తీశారు. భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీ వారితో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని సూచించారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్‌లో కృత్రిమ కల్లు జోరు!

రాజాపూర్‌: మండలంలోని కొన్ని గ్రామాల్లో ఈత చెట్లు లేకున్నా.. కృత్రిమంగా తయారుచేసే కల్లు జోరు మాత్రం తగ్గడం లేదు. అల్ప్రాజోలమ్‌, డైజోఫామ్‌ వంటి మత్తు మందులు కలిపి గ్రామాల్లో కొందరు కల్లు విక్రయిస్తుండటంతో దానికి అలవాటైన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో గౌడకులస్తులు ఉన్నా.. ఇతరగ్రామాలకు చెందిన కల్లు కాంట్రాక్టర్‌ల హవా సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. గౌడ కులస్తులకు సంవత్సరానికి కొంత మొత్తం చెల్లించి కల్లు దుకాణాలు నడుపుతున్నారు. ఒక్కోసారి కల్లులో మత్తు మందు ఎక్కువ, తక్కువ కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మత్తుకు అలవాటైన వారు కల్లు లేకపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించి ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయి. ప్రతినెలా సంబంధిత అధికారులకు మామూళ్లు అందుతున్నాయని.. అందువల్లే కాంట్రాక్టర్‌లు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారని వినవస్తోంది.

మహబూబ్‌నగర్‌ టికెట్‌ బీసీలకే ఇవ్వాలి



ఐక్యతా చిహ్నం ప్రదర్శిస్తున్న బీసీనాయకులు

జడ్చర్ల టౌన్‌: రాజకీయపార్టీలన్నీ మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ టికెట్‌ను బీసీలకే కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్‌ నేతృత్వంలో బుధవారం పట్టణంలో జరిగిన రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో నాయకులు డిమాండ్‌ చేశారు. అన్ని రాజకీయపార్టీలు జెండాలు మోసే కూలీలుగానే బీసీలను వాడుకొంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నాయని వాపోయారు. రాజ్యాధికారంలో బీసీలకు రావాల్సిన వాటా ఇవ్వకుండా అగ్రకులపార్టీలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీ జపం చేశాయని.. కానీ జనాభా ధామాషా ప్రకారం సీట్లు కేటాయించకుండా అణచివేశాయన్నారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ ఉనికి కాపాడటానికి సొంత ఆస్తులను అమ్మిన బెక్కం జనార్దన్‌కు, కాంగ్రెస్‌ ఉనికి కాపాడుతున్న సంజీవ్‌ముదిరాజ్‌కు, పదిహేనేళ్లుగా మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో సొంత ఖర్చులతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న బండారి శాంతికుమార్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. వలస నేతల కోసం వారిని ఎదగనివ్వలేదని ఆరోపించారు. ఈ పర్యాయం టికెట్‌ కేటాయించి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. బీసీలకు టికెట్‌ కేటాయిస్తే వారి గెలుపు కోసం కృషిచేస్తామని ప్రకటించారు. రౌండ్‌ టేబుల్‌సమావేశంలో ఆయా పార్టీలు, ప్రజాసంఘాల బీసీనాయకులు బి.రవిశంకర్‌, యం.బిబాలకృష్ణ, నిరంజన్‌, ఆంజనేయులు, వీరేష్‌, శంకర్‌, గోపాల్‌, మాచారం శ్రీను, ఫకీర్‌జహంగీర్‌, వెంకటేశ్‌గౌడ్‌, మల్లేష్‌, లింగంపేట శేఖర్‌, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను మెరుగు పరుస్తాం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: గ్రామాల్లో ప్రజా సౌకర్యాలను మెరుగు పరచడానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌకుంట్ల మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ హయాంలో గ్రామాలు వెనుకబడి పోయాయన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామాల్లో అవసరం ఉన్న చోట సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని.. గతంలో కాంగ్రెస్‌ హయాంలోనే చేసిన పనులు కని పిస్తున్నాయని అన్నారు. ఆరు గ్యారంటీలను పేదలందరికీ అందించడమే ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్‌ ఎంపీపీ సుజాత, టీపీసీసీ కార్యదర్శి అరవిందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని కాపాడండి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: జిల్లా కేంద్రం వీరన్నపేటలో శ్మశానవాటిక కోసం ఆరున్నర ఎకరాల స్థలాన్ని కొన్నేళ్ల క్రితం పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు కొన్నారని.. అధ్యక్షుడు ఖాజా ఫయాజుద్దీన్‌ అన్వర్‌పాషా అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆ స్థలంపై కొంతమంది తమదంటూ చెప్పడంతో శ్మశానవాటిక కమిటీ కోర్టుకు వెళ్లగా కమిటీకి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. సదరు భూమిని రిజిస్ట్రేషన్‌ చేశారని వివరించారు. కాగా ఇటీవలే కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థలాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు హఫీజ్‌ ఇద్రీస్‌, అహ్మద్‌ సనా, మతీన్‌ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన



పూజలు చేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక ఆరోవార్డు పరిధిలోని శ్రీనివాసకాలనీ లో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు రూ.19.2 లక్షల చేపట్టే సీసీరోడ్డు పనులకు బుధవారం మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభయ ఆంజనేయస్వామివారి ఆశీస్సులు అందరిపై ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ షబ్బీర్‌అహ్మద్‌, కౌన్సిలర్‌ పటేల్‌ ప్రవీణ్‌ కుమార్‌, కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్‌, ఏఈ హరికృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణయ్య, అనంత్‌రెడ్డి, నాగేశ్వర్‌, బస్వరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పబ్లిక్‌ స్కూళ్ల'ను పాఠశాలల్లోనే ఏర్పాటు చేయాలి

నవాబుపేట: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ పబ్లిక్‌ స్కూళ్లను ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్‌ అన్నారు. బుధవారం వివిధ అంశాలపై నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం నిర్ణయం సరైందని.. గతంలో ఉన్న పాఠశాలలను కాపాడాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే.. కొత్తవి నెలకొల్పి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. గతంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల మూలంగా ప్రభుత్వానికి అదనపు భారం భారీగా పెరిగిందన్నారు.

పాఠశాల గ్రాంటు వెంటనే ఇవ్వాలి

పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం గతంలో గ్రాంటు మంజూరు చేసిందని పీఆర్‌టీయూ మండల నాయకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాంటులో ఇప్పటికే 50 శాతం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం మరో 50 నిధులు అందించాల్సి ఉందన్నారు. కానీ తాజాగా పాఠశాలల ఎస్‌ఎంసీల కమిటీలు రద్దు కావటంతో పాఠశాల గ్రాంటును డ్రా చేయటం రాదన్నారు. అందువల్ల ఈ విద్యా సంవత్సరం పూర్తి కాకముందే పాఠశాలల హెచ్‌ఎంలకు గ్రాంటు అందేలా చేయాలని కోరారు. మండల నాయకులు రమాకాంత్‌, శాంసుందర్‌ రెడ్డి, నసీర్‌ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



నవాబుపేట: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని ఏపీడీ సందీప్‌ కుమార్‌ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కూలీల సంఖ్య 2 వందలకు తగ్గకుండా చూడాలని అన్నారు. ఉపాధి కూలీలకు నీడ విషయంలో గ్రామపంచాయతీ ద్వారా తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు కావాల్సిన ప్రధానమైన పనులను ముందుగా చేసేలా తీర్మానం చేసి చేపట్టాలని వివరించారు. ఏపీఓ జ్యోతీ, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

సభకు తరలిన నాయకులు



భూత్పూర్‌ నుంచి బయలు దేరిన నాయకులు



ఉంద్యాల నుంచి బయలుదేరిన నాయకులు

సాక్షి నెట్‌వర్క్‌: కోస్గిలో బుధవారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభకు వెళ్లే వాహనాలను జిల్లాకేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్‌, సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, కృష్ణయ్యయాదవ్‌, లక్ష్మణ్‌యాదవ్‌, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట పరిధిలోని వడ్డేమాన్‌, ఉంధ్యాల, మద్దూర్‌, దమగ్నాపురం, నెల్లికొండి, తిరుమలాపూరం, పర్దిపూరం, బండ్రపల్లి తదితర గ్రామాలనుంచి వివిధ వాహనాల్లో కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. సీఎం రేవంత్‌ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతోందని పేర్కొన్నారు. త్వరలోనే ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తారని ఈ సందర్భంగా వివరించారు.

భూత్పూర్‌ పరిధిలో మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఎస్సీసెల్‌ మండల అధ్యక్షుడు నర్సింహులు, ఎంపీటీసీ పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ తిరుపతయ్య, యాదిరెడ్డి, తమ్మన్న గౌడ్‌, నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



ఆర్జేడీ రాజేందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్‌ పద్మావతి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని ఆర్జేడీ రాజేందర్‌సింగ్‌ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన బీఎఫ్‌ఎస్‌ఐ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాల్లో చేరడం గొప్ప విషయం అన్నారు. బ్యాంకింగ్‌ రంగంలో విద్యార్థులకు శిక్షణ అందించినందుకు గాను ఐసీటీ సంస్థ వారిని ఆయన అభినందించారు. బీఎఫ్‌ఎస్‌ఐ వంటి శిక్షణ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు బ్యాంకింగ్‌, వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంవీఎస్‌ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు వివిధ ఐఎఎస్‌, ఐపీఎస్‌ వంటి స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 63 మంది డిగ్రీ విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్‌ పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణ, గోపాల్‌రెడ్డి, రాజేందర్‌, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.